క్లుప్తంగా

వలంటీర్లకు ఇచ్చిన హామీ నెరవేర్చాలి

మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఎన్నికల్లో కూటమి నేతలు వలంటీర్లకు ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని.. వారిని విధుల్లోకి తీసుకుని రూ. 10వేలు గౌరవ వేతనం ఇవ్వాలని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజక వర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం వలంటీర్లను మోసం చేసిందని విమర్శించారు. ఎన్నికలకు ముందు వలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తామని చెప్పిన కూటమి నేతలు అధికారంలోకి వచ్చిన తర్వాత వలంటీర్లను పట్టించుకోకపోవడం విచారకరం అన్నారు. ప్రభుత్వ తీరుతో వలంటీర్ల కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయన్నారు. వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలని.. లేనిపక్షంలో ప్రత్యామ్నాయం చూపించాలని డిమాండ్ చేశారు. గత 15 నెలలుగా బకాయి పడ్డ గౌరవ వేతనం తక్షణమే చెల్లించాలన్నారు. లేని పక్షంలో వైఎస్సార్ సీపీ వలంటీర్ వింగ్ ఆధ్వర్యంలో రాష్ట్రం వ్యాప్తంగా పోరాటం చేస్తామని విష్ణు హెచ్చరించారు.

సాయినాథునికి క్షీరాభిషేకం



మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో సాయినాథుని పుణ్యతిథి మహోత్సవాల్లో భాగంగా మంగళవారం బాబావారికి క్షీరం, పెరుగుతో అభిషేకం నిర్వహించారు. లోక కల్యాణార్థం మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి దంపతులు వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ సాయినాథ, సుబ్రహ్మణ్య హోమం నిర్వహించారు. మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ జరిగింది. సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కాగా బాబావారిని ఇన్‌కంట్యాక్స్ ప్రిన్సిపల్ కమిషనర్ సునీత బిళ్ల దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ అర్చకులు, మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. బాబావారి చిత్రపటం, శేషవస్త్రంతో సత్కరించారు. కార్యక్రమంలో మందిర కోశాధికారి మందలపర్తి సత్యశ్రీహరి పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ వివాహిత మృతి చెందిన ఘటనపై కొత్తపేట పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాత రాజరాజేశ్వరిపేట జేపీ అపార్టుమెంట్‌కు చెందిన షేక్ నాసిర బేగం, సయ్యద్ ఉస్మాన్‌లు భార్యాభర్తలు. నాసిరబేగంకు గతంలో వివాహం కాగా భర్తతో విభేదాల కారణంగా సయ్యద్ ఉస్మాన్‌ను రెండో వివాహం చేసుకున్నారు. ఉస్మాన్ ఉద్యోగ రీత్యా సౌదీలో ఉంటున్నారు. నాసిర బేగంకు గత కొంతకాలంగా అనారోగ్యంతో మందులు వాడుతున్నారు. కాగా ఈనెల 21వ తేదీన నాసిర బేగం ఉదయం, సాయంత్రం వేసుకోవాల్సిన మందులను ఒకేసారి వేసుకున్నారు. దీంతో ఆమె అపస్మారక స్థితికి చేరుకోగా కుటుంబ సభ్యులు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న ఆమె మంగళవారం తెల్లవారుజామున మృతి చెందారు. ఘటనపై నాసిర బేగం అన్న సయ్యద్ హానిఫ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బహుముఖ ప్రతిభాశాలి 'ఎస్పీబీ'




విజయవాడ కల్చరల్: సినీ సంగీత దర్శకుడు, గాయకుడు ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం బహుముఖ ప్రతిభాశాలి అని చింతకాయల చిట్టిబాబు అన్నారు. బాలు వర్ధంతి సందర్భంగా గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానందం కళావేదికపై మంగళవారం నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆకట్టుకుంది. గాయకులు బాలు పాడిన గీతాలను ఆలపించారు. నిర్వాహకుడు చిట్టిబాబు మాట్లాడుతూ బాలు దాదాపు 50 వేలకు పైగా పాటలు పాడారని పేర్కొన్నారు. డేవిడ్‌రాజు, వీరభద్రరావు, ప్రసూనారామన్, గోళ్ల నారాయణరావు, చంద్రశేఖర్ పాల్గొన్నారు. గాయకులను నిర్వాహకులు సత్కరించారు.



శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో శ్రీలలితా త్రిపుర సుందరీగా అమ్మవారు



శ్రీశ్యామలాంబదేవి ఆలయంలో గాయత్రీదేవి అలంకరణ



జీవీఆర్‌నగర్‌లో అమ్మవారు



రామలింగేశ్వరస్వామి ఆలయంలో శ్రీగాయత్రీదేవి అలంకరణ



అంకమ్మతల్లి శక్తిపీఠంలో అమ్మవారు



మధురానగర్ మెయిన్ రోడ్డులో..

గాయత్రీమాతా పాహిమాం..

- భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాలు
- రెండో రోజు అమ్మవారికి విశేష పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు మంగళవారం అమ్మవారిని శ్రీగాయత్రీదేవిగా అలంకరించి పూజలు చేశారు. అమ్మవారికి ప్రీతికరమైన రోజు కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ముత్యాలంపాడులో...

ముత్యాలంపాడు శ్రీపార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారిని శ్రీగాయత్రీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. స్థానిక గ్రామదేవత శ్రీగంగానమ్మ తల్లి ఆలయంలో అమ్మవారు శ్రీవారాహీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమాలను ఆలయ అభివృద్ధి కమిటీ కార్యదర్శి మండపాటి యుగంధర్ వర్మ పర్యవేక్షించారు. అలాగే శ్రీదత్త సాయి శివకామేశ్వరీ పీఠంలో అమ్మవారిని శ్రీధర్మపరిషత్ మహాసంస్థానమ్ ఆధ్వర్యాన శ్రీలలితా త్రిపుర సుందరీదేవిగా అలంకరించి పూజలు చేశారు. శ్రీచక్రార్చన, లలితా సహస్రనామ పారాయణం జరిగింది. లోక కల్యాణార్థ లక్ష్మీగణపతి, రుద్ర, శ్రీచక్ర హోమం నిర్వహించారు. కార్యక్రమాలను పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమసుందర వరప్రసాద్ పర్యవేక్షించారు. 30వ డివిజన్ దావు బుచ్చయ్యకాలనీలో అమ్మవారిని శ్రీగాయత్రీదేవిగా అలంకరించారు.



కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో బాలా త్రిపుర సుందరీదేవి

రామలింగేశ్వరపేటలో..

రామలింగేశ్వరపేట శ్రీప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో అమ్మవారు శ్రీగాయత్రీదేవిగా అలంకరణలో పూజలు అందుకున్నారు. జీవీఆర్‌నగర్‌లో అమ్మవారిని జీవీఆర్‌నగర్ భక్తబృందం ఆధ్వర్యాన శ్రీగాయత్రీదేవిగా అలంకరించి పూజలు చేశారు. మధురానగర్ పుట్టవీధిలోని స్వయంభూ శ్రీబాలసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో, అంకమ్మతల్లి శక్తిపీఠంలో, మధురానగర్ మెయిన్ రోడ్డులో అమ్మవార్లను శ్రీగాయత్రీదేవిగా అలంకరించి పూజలు చేశారు.

కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో..

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): స్థానిక సత్యనారాయణపురంలోని శ్రీకాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో కొలువైయున్న శ్రీఅన్నపూర్ణా దేవి దసరా మహోత్సవాల్లో భాగంగా రెండో రోజు మంగళవారం బాల త్రిపుర సుందరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు బారులు తీరారు. ఆలయ పండితులు అమ్మవారికి కుంకుమార్చన, భోగనీరాజన, మహా మంత్రపుష్ప కైంకర్యాలు నిర్వహించారు. ఆలయ కార్యదర్శి గంగాధరరావు పర్యవేక్షణలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

వేదమాతా నమోస్తుతే..

విజయవాడ కల్చరల్: కంచి కామకోటి పీఠస్థ శారదా చంద్రమౌళీశ్వరస్వామి దేవస్థానంలో మంగళవారం శారదాదేవిని గాయత్రి మాతగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. స్వామివారికి క్షీరాభిషేకం, పెండ్లికుమారుని చేయడం, విష్వక్సేన పూజ, గరుడ ప్రతిష్ట అంకురార్పణ నిర్వహించారు. శివరామకృష్ణ క్షేత్రంలో శారదా మాతను హంసవాహిని బ్రాహ్మిగానూ, బాలా త్రిపుర సుందరిని గాయత్రిదేవిగా, శ్రీమహాలక్ష్మిని ఆదిలక్ష్మిగా అలంకరించారు. వేదపండితులు దుర్గా సప్తశతి, చండీహోమం వేదోక్తంగా నిర్వహించారు.

బాలా త్రిపుర సుందరిగా అన్నపూర్ణాదేవి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గవర్నర్‌పేటలోని చల్లపల్లి బంగ్లా సమీపంలో వేంచేసి ఉన్న శ్రీకాశీవిశ్వేశ్వర అన్నపూర్ణ దేవస్థానంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అన్నపూర్ణాదేవి భక్తులకు బాలా త్రిపుర సుందరీదేవిగా దర్శనమిచ్చింది. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. బాలా త్రిపుర సుందరి మూల మంత్ర జపం చేశారు. అనంతరం ప్రసాద వితరణ జరిగింది.



శారదా చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో గాయత్రీదేవి అలంకారంలో అమ్మవారు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సూర్యారావుపేట సెక్షన్, సీతారామపురం సబ్‌స్టేషన్ 11కేవీ సత్యసాయి, సూర్యారావుపేట ఫీడర్ల పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం బుధవారం ఉదయం ఎనిమిది నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీతారామపురం రైవస్ కాలువగట్టు, మల్లెల శ్రీరామమూర్తి వీధి, కొల్లిపరవారి వీధి, వీరమాచినేని రంగారావు వీధి, వారణాసివారి వీధి, ఐనవోలువారి వీధి ఏలూరురోడ్డు సీతారామపురం సిగ్నల్స్ ప్రాంతాలు, సీతారామపురం వీఎంసీ డ్రెయినేజీ పంప్ హౌస్, కొత్తూరు శ్రీరామమూర్తి రోడ్(కొత్తవంతెన రోడ్), దుర్గా అగ్రహారం కాలువ గట్టు, కాట్రగడ్డవారి వీధి, జనతా ప్రెస్ రోడ్, బోడేపూడివారి వీధి, అయ్యన్నాయుడు వీధి, అంకమ్మతల్లి గుడి ఏరియా తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

అలరించిన సంగీత కచేరీ

విజయవాడ కల్చరల్: శివరామకృష్ణ క్షేత్రంలో నవరాత్రుల సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా మంగళవారం భారతీ తీర్థ శ్రవణసదనంలో మల్లాది నాగలక్ష్మి, మల్లాది సింధురాగేశ్వరి నిర్వహించిన శాస్త్రీయ సంగీత కచేరీ మధురంగా సాగింది. మల్లాది శివానంద యశశ్వి వాద్య సహకారం అందించారు.

దసరా ప్రాధాన్యతను దిగజారుస్తున్న వైనం

'విజయవాడ ఉత్సవ్'లో కనిపించని అమ్మ విశిష్టత

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): 'విజయవాడ ఉత్సవ్' పేరుతో నగరంలో కూటమి నేతలు నిర్వహిస్తున్న వేడుకలు ఇంద్రకీలాద్రిపై కొలువున్న దుర్గమ్మ శరన్నవరాత్రి ఉత్సవానికి తూట్లు పొడిచేట్లుగా ఉన్నాయని పలువురు విమర్శిస్తున్నారు. దసరా ఉత్సవాలను మరింత శోభయమానంగా నిర్వహిస్తామని చెబుతున్న కూటమి నేతలు అమ్మవారి ప్రాముఖ్యతను దిగజారుస్తున్నారంటూ మండి పడుతున్నారు. కేవలం కూటమి నేతల కోసమే హడావుడి చేస్తున్నారని వ్యాఖ్యానిస్తున్నాయి.

ఉత్సవ్ పేరుతో బురిడీ..

దేశంలో మైసూర్ దసరా ఉత్సవాలకు చాలా ప్రాముఖ్యత ఉంది. అటువంటి ఉత్సవాలకు ధీటుగా విజయవాడ ఉత్సవ్ పేరుతో అమ్మవారి ప్రాధాన్యతను పెంచడానికి కార్యక్రమాలను నిర్వహిస్తామని కూటమి నేతలు ప్రకటించారు. మైసూర్‌లోని చాముండేశ్వరి అమ్మవారి ఉత్సవాలు, మైసూర్ మహారాజ వారి వైభవాన్ని చాటే కార్యక్రమాలు దసరా ఉత్సవాల్లో కొనసాగుతాయి. కానీ ఇక్కడ అందుకు భిన్నమైన అందాల పోటీలు, ఫ్లాష్‌మాబ్‌ల పేరుతో పాశ్చాత్య పోకడలను విస్తరింపజేసే కార్యక్రమాలను నిర్వహిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

భారీ దోపిడీ కోసమే..

విజయవాడ ఉత్సవ్ పేరుతో నగరంలో భారీ దోపిడి చేస్తున్నారని పలువురు నేతలు విమర్శిస్తున్నారు. గొల్లపూడి ప్రాంగణంలో ఎగ్జిబిషన్ పేరుతో స్టాల్స్‌ను ఏర్పాటు చేసి ఒక్కో స్టాల్‌కు రూ.లక్షల్లో వసూలు చేశారు. అలానే మణిశర్మ, సునీత వంటి ప్రముఖుల సంగీత విభావరిల కోసం బుక్ మై షోలో టిక్కెట్లను నిర్వాహకులు భారీ రేట్లకు విక్రయిస్తున్నారు. హెలికాప్టర్ రైడ్ పేరుతో వసూలు చేస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. కార్యక్రమంలో ఎక్కడా నగరంలోని సామాన్యుల భాగస్వామ్యం లేదని పలువురు వాపోతున్నారు. ముఖ్యమైన కార్యక్రమాలకు టికెట్లు పెట్టి పూర్తిగా ప్రైవేట్ కార్యక్రమం చేశారని.. విజయవాడ ఉత్సవ్‌కు ప్రభుత్వ పర్యాటక శాఖ నిధులు ఇస్తామని చెప్పడం, దసరా ఉత్సవాల్లో భాగస్వాములైన అధికారులను కూడా విజయవాడ ఉత్సవ్‌లో వినియోగించుకోవడంపై అధికార దుర్వినియోగమేనని వ్యాఖ్యానిస్తున్నారు.

ఘనంగా ఆయుర్వేద దినోత్సవం

పాయకాపురం(విజయవాడరూరల్): పాయకాపురం, రాజీవ్‌నగర్‌లోని ప్రాంతీయ ఆయుర్వేద పరిశోధన కేంద్రంలో మంగళవారం 10వ ఆయుర్వేద దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ ఇన్‌చార్జి అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ బి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 2016లో ఆయుర్వేద దినోత్సవాన్ని ప్రకటించిందని తెలిపారు. ధన్వంతరి జయంతి రోజున ఆయుర్వేద దినోత్సవం నిర్వహించుకొంటున్నామని చెప్పారు. విజయవాడ ఆయుర్వేద పరిశోధన కేంద్రంలోని సేవలను వివరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ పరిశోధన అధికారులు డాక్టర్ ఏజేవీ సాయిప్రసాద్, డాక్టర్ సవిత, సిబ్బంది పాల్గొన్నారు. తొలుత ధన్వంతరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



బహుమతులు అందజేస్తున్న ఏడీ డాక్టర్ వెంకటేశ్వర్లు



గురుకుల కళాశాలలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ నీరజ

గురుకుల కళాశాలలో...

మధురానగర్(విజయవాడసెంట్రల్): సుప్రసిద్ధ ఆయుర్వేద వైద్యుడు మహర్షి ధన్వంతరీ జయంతి సందర్భంగా మంగళవారం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాల ప్రాంగణంలోని గురుకుల కళాశాలలో జాతీయ ఆయుర్వేద దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వల్లూరు నీరజ ఆయుర్వేద వైద్యం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఎన్ఎస్ఎస్ అధికారి లావణ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రోన్లతో పారిశుధ్య నిర్వహణ పరిశీలన

పటమట(విజయవాడతూర్పు): శరన్నవరాత్రి ఉత్సవాలను డ్రోన్లతో పర్యవేక్షిస్తూ వసతుల్లో ఎటువంటి లోపం లేకుండా చర్యలు తీసుకోవాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. నగర పర్యటనలో భాగంగా ఆయన మంగళవారం వినాయకుని గుడి, కెనాల్ రోడ్, సీతమ్మవారి పాదాలు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులు ఇబ్బందులు పడకూడదని, భక్తులు చెప్పుల స్టాండ్లు ఉన్నప్పటికీ రోడ్లపైనే చెప్పులను వదిలేయటం చూసి ప్రజలకు సౌకర్యాలను మరిన్ని పెంచాలని ఆదేశించారు. అవసరమైన చోట ఉచిత చెప్పులు, సామాన్లు భద్రపరిచే స్టాండ్ల సంఖ్య పెంచమని అధికారులను ఆదేశించారు. తాగునీటి సరఫరాలో నిరంతరం స్టాక్ పాయింట్ల నుంచి తాగునీటి పాయింట్లకు సరఫరా అయ్యేటట్లు అధికారులు పర్యవేక్షిస్తూ ఉండాలని అధికారులను ఆదేశించారు. పారిశుధ్య నిర్వాహణలో నిరంతరం డ్రోన్లతో అధికారులు పర్యవేక్షిస్తూ ఉండాలని ఆదేశించారు.

నయన మనోహరంగా సంప్రదాయ నృత్యాలు

విజయవాడ కల్చరల్: దేవదాయ ధర్మాదాయ శాఖ, శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో కనకదుర్గానగర్‌లోని కళా వేదికపై కళాకారులు ప్రదర్శిస్తున్న అంశాలు నయన మనోహరంగా సాగుతున్నాయి. మంగళవారం నాటి కార్యక్రమంలో త్యాగరాజ స్వామి, ముత్తుస్వామి దీక్షితార్, శ్యామశాస్త్రి, రామదాసు, అన్నమయ్య, భారతీ తీర్థ స్వామి కీర్తనలకు పలువురు కళాకారులు నృత్యాలను అభినయించారు. రాంబాబు బృందం తాళ భజన, సుధారాణి, అన్నపూర్ణ రాగంపూడి అమూల్య, సాయిబాబు, నాగబాబు భక్తి సంకీర్తనలను ఆలపించారు. జేఎస్ మూర్తి భరతనాట్యం, ఎం.ప్రశాంతి, వి.ఉజ్వల్, ఎమ్.హేమకుమారి, బి.సాహిత్య, నందిత, శైలజ, ఎస్.అనిత, జయశ్రీ, బాలజీ, ఎం.పల్లవి సంప్రదాయ నృత్యాలను ప్రదర్శించారు. నిర్వాహకులు గంగాధర్, సైదా, రామకృష్ణలు పర్యవేక్షించారు. కళాకారులకు ప్రశంసాపత్రాలను అందజేశారు.



నృత్యాలను ప్రదర్శిస్తున్న కళాకారులు

అక్టోబరు 31 వరకు ఓపెన్‌స్కూల్ దరఖాస్తులకు గడువు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించే పది, ఇంటర్మీడియట్ కోర్సుల దరఖాస్తులకు అక్టోబరు 31వ తేదీ వరకూ అపరాధ రుసుంతో గడువును పొడిగించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి యూవీ సుబ్బారావు తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆయా కోర్సుల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరణ, నగదు చెల్లింపులు అపరాధ రుసుం రూ.200లతో అక్టోబరు 31వ తేదీ వరకూ చెల్లించవచ్చని పేర్కొన్నారు. ఏపీ ఆన్‌లైన్, మీ సేవా కేంద్రాలు, గ్రామవార్డు సచివాలయాలు, ఏపీ ఓపెన్‌స్కూల్ వెబ్‌సైట్ ద్వారా చెల్లించవచ్చని ఆయన వివరించారు.

నేత్రపర్వంగా సాంస్కృతిక ప్రదర్శనలు

విజయవాడ కల్చరల్: రాష్ట్ర ప్రభుత్వం, నాటక అకాడమీ విజయవాడ ఉత్సవ్ కమిటీ ఆధ్వర్యాన దుర్గాపురంలోని సంగీత కళాశాలలో మంగళవారం ప్రదర్శించిన అంశాలు నేత్రపర్వంగా సాగాయి. నాట్యాచార్యుడు వాసుదేవరావ్ బృందం కూచిపూడి సంప్రదాయంలో పలు అంశాలను ప్రదర్శించారు. ప్రగతి సంప్రదాయ నృత్యాలయ విద్యార్థులు అన్నమయ్య కీర్తనలకు నృత్యాలను అభినయించారు. నాట్యాచారిణి శైలశ్రీ బృందం సంప్రదాయ నృత్యాలను, తోట బాలకృష్ణ బృందం తోలు బొమ్మలాటను ప్రదర్శించారు.



అంబిక బృందం నృత్య ప్రదర్శన

తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో..

అనూషా నాయుడు బృందం కూచిపూడి సంప్రదాయంలో అన్నమయ్య కీర్తనలకు నృత్యాలు ప్రదర్శించారు. సంగీత విద్వాంసురాలు తుషార పూర్ణవల్లి సంప్రదాయ కీర్తనలను, అనంతపురానికి చెందిన సి.రాములు బృందం ఉరుములు సంప్రదాయ నృత్యాలను, అంబిక బృందం సంప్రదాయ నృత్యాలను ప్రదర్శించారు.

ఇంద్రకీలాద్రి పరిసరాల్లో చెప్పులతో సంచారం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దసరా ఉత్సవ వేళ ఇంద్రకీలాద్రిపై అపచారం చోటు చేసుకుంది. భక్తులు అత్యంత పవిత్రంగా భావించే ఆలయ, ఉపాలయాల పరిసరాల్లో ముగ్గురు వ్యక్తులు మంగళవారం కాళ్లకు చెప్పులు వేసుకుని తిరిగారు. అమ్మవారి దర్శనం తర్వాత బయటకు వచ్చే దారిలో నటరాజ స్వామి ఆలయం, గణపతి ఆలయం, పక్కనే శ్రీ గంగా పార్వతీ సమేత మల్లేశ్వర స్వామి వార్లకు కుంకుమార్చన నిర్వహించే ప్రాంగణం, వెనుక వైపు శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి ఆలయాలు ఉన్నాయి. నటరాజస్వామి వారి ఆలయం నుంచి ముగ్గురు వ్యక్తులు నేరుగా కుంకుమార్చన ప్రాంగణం, సుబ్రహ్మణ్య స్వామి వారి ఆలయాల మీదగా లక్ష్మీ గణపతి ప్రాంగణం వైపు చెప్పులతో పరుగులు తీశారు. అమ్మవారి ఆలయ పరిసరాల్లోకి చెప్పులతో రాకుండా ఘాట్‌రోడ్డులోని పలు చోట్ల దేవస్థానం స్టాండ్‌లను ఏర్పాటు చేసింది. అయితే ఈ ముగ్గురు వ్యక్తులు ఆలయ పరిసరాల్లోకి చెప్పులు వేసుకొని రావడమే కాకుండా తాఫీగా పరిసరాల్లో తిరుగుతూ కనిపించారు. ఇటువంటి వారిపై దేవస్థాన అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

